క్లుప్తంగా

పీ-4 సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి



తెనాలి అర్బన్: పీ–4 సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వార్డు ప్లానింగ్, వెల్ఫేర్ సెక్రటరీలతో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహిస్తోందని తెలిపారు. అందరూ తమ పరిధిలోని బంగారు కుటుంబాలను గుర్తించాలని సూచించారు. అలాగే మార్గదర్శి కూడా గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏసీపీ శివనారాయణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు లయన్ కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు బుధవారం రాత పుస్తకాలు, పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు నేరెళ్ల వెంకటకృష్ణ మోహన్‌రావు, అయినాల మల్లేశ్వరరావు, హెచ్ఎం చావలి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మంచి పౌష్టికాహారం



తెనాలి టౌన్: తల్లిపాలు బిడ్డకు మంచి పౌష్టికాహారం అని జేఎంజే మహిళా కళాశాల హోమ్ సైన్సు విభాగాధిపతి పి.హేమలత తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక 23వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకత, వాటితో కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని అన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వై.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

ఏపీజీఈఏ తెనాలి అధ్యక్షుడు శ్రీనివాసరావు



తెనాలి అర్బన్: ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెనాలి తాలుకా యూనిట్ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుదాం' కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్యశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కారుమూరి కమల కుమారి, దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందే బాలచంద్ర మౌళి, నాయకులు దీపాల శ్రీనివాసరావు, దగ్గుబాటి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

నెహ్రూనగర్: నగరంలో అనుమతులు లేకుండా నిర్మించే ఎటువంటి కట్టడాలనైనా కూల్చివేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలో గత మూడు రోజుల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను గుర్తించి, తొలగించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అనధికారిక, ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులకు నోటీసులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు. సదరు నిర్మాణాలను కూల్చివేయడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డులోని భవానీనగర్ , శ్రీరామనగర్ 7వ లైన్, బొంగరాల బీడు, అరండల్ పేట ప్రాంతాలలో అక్రమ కట్టడాలను కూల్చినట్లు వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తించి తుది నోటీసులు అందించిన 25 అనధికార భవనాలను గురువారం కూల్చివేత చేపట్టాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం నుంచి అనధికార లే అవుట్స్ తొలగించాలని చెప్పారు. అనధికార హోర్డింగ్స్‌ని ఉపేక్షించ వద్దని, ఫీజులు చెల్లించని ఏ బోర్డునైనా తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

కాలువలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి



ఆక్రమణల తొలగింపు పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ వెంకటేశ్వరరావు



సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్: మురుగు కాలువలపై ఏర్పాటు చేసిన రోప్‌లు, బండలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 4వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాలువలపై ఏర్పాటు చేసిన వస్తువులను సిబ్బందితో తొలగించారు. కాలువలు కనిపించే విధంగా ఉంచాలని ఇంటి యజమానులును సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు బుధవారం పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను ఆయన పరిశీలించారు. ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి, చెత్తను వేరువేరుగా సేకరించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ వాటిని విభజించి కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

మోసానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

- సంక్షేమానికి చిరునామా వైఎస్ జగన్
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కొల్లిపర గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న శివకుమార్

కొల్లిపర: సంక్షేమం అంటే రాష్ట్రంలో ప్రజలకు గుర్తొచ్చేది దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని.. అలాగే వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని.. ప్రజలను మోసం చేసే నాయకులు ఎవరైనా ఉన్నారంటే రాష్ట్ర ప్రజలకు గుర్తొచ్చే ఏకైక వ్యక్తి చంద్రబాబేనని తెనాలి నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే , పార్టీ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కొల్లిపర గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి బాబు మోసాలను ప్రజలకు వివరించారు. గడప గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీలపై ప్రజలను అడిగి తెలుసుకుని, వంచన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. త్రికరణ శుద్ధితో ప్రమాణం చేసి మరీ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి ప్రజలను కూటమి నేతలు మోసం చేశారని ధ్వజమెత్తారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ ప్రధానాలోచన మేరకు అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా పక్షంలోనే తాము ఉంటామని తెలిపారు.

పూర్తిగా అమలు చేయని హామీలు..

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నాబత్తుని శివకుమార్ మండిపడ్డారు. ఇప్పటికీ అమలు చేయని పలు హామీలను ఆయన ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత నాయకులతో కలిసి చింపారెడ్డి పాలెంలోని రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచి పిల్లి రాధిక, ఉపసర్పంచి అవుతు కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కళ్లం వెంకటప్పారెడ్డి, గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, మండల యువజన విభాగ అధ్యక్షుడు ఈద యస్వంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నాల్లాడి బుజ్జిబాబు, ఆరిమండ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, కళ్లం వీరారెడ్డి, చెంచల రామిరెడ్డి, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, ఎస్‌కే అబ్దుల్లా, గడికోట శ్రీనివాసరావు, అవుతు సాంబిరెడ్డి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ నేతన్న సర్కిల్ వద్ద జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం నిర్వహించబడునని పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, ఆకురాతి రాజేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు నేతన్న విగ్రహాన్ని చేనేత విభాగం ఆధ్వర్యంలో పూలమాలలతో అలంకరించి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



తాడికొండ: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్ష తప్పదని తాడికొండ ఎస్ఐ కె.జోజి హెచ్చరించారు. బుధవారం తాడికొండ మండలం లాం, అడ్డరోడ్డు, తాడికొండలోని పలు ప్రాంతాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను నిలిపి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వచ్చే ఎన్నికల సమయానికి రాజకీయాల్లోకి వస్తా



తాడికొండ: వచ్చే ఎన్నికల సమయానికి తాను రాజకీయాల్లోకి వస్తానని సినీనటుడు సుమన్ అన్నారు. తుళ్ళూరు మండలం మందడం గ్రామంలో నిర్వహించిన రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో ఒడిదొడుకులు సహజమని, కానీ ఈ సమయంలో పెట్టే పెట్టుబడులు భవిష్యత్తుకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం భూముల ధరలు అంతగా ఎక్కువగా లేకున్నా భవిష్యత్తులో మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రొప్రయిటర్ నర్రా నారాయణ, పలువురు వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని మోటారు సైకిల్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి.అబ్రహాం(76) తన సైకిల్‌పై పేరేచర్లకు వెలుతుండగా, గ్రామ శివారులోని బీసీ కాలనీ సమీపంలో సైకిల్‌ను వెనుక నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అబ్రహాం తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న యువకుడికి గాయాలవగా చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి అధికం



తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన

మంగళగిరి: తల్లి పాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తితో పాటు జ్ఞాపకశక్తిని పెంచుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గణపతినగర్ పీహెచ్‌సీలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాదన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు చాలా విలువలతో కూడుకున్నవని అన్నారు. బిడ్డకు ఆరునెలలు వచ్చేవరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు లమృతంతో సమానమన్నారు. తల్లిపాలు పుట్టిన బిడ్డకు మొదటి టీకాతో సమానమన్నారు. అనంతరం తల్లులకు ప్రొటీన్ పౌడర్, పండ్లు, రాగిజావ పంపిణీ చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎ.శ్రావణ్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ఎయిమ్స్ సీఏఫ్‌వో హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ సురేంద్ర, సూపర్‌వైజర్‌లు రత్నకుమారి, శ్రీదేవి, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: తల్లిపాలు బిడ్డకు తాగించడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన అన్నారు. మహిళశిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దీనాపూర్ ఫార్మసీ కళాశాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ ప్రసవించిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, దాని ద్వారా బిడ్డకు ఏడీఈకే విటమిన్స్ అందుతాయని చెప్పారు. తల్లులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల సమాజంలో జాగ్రత్తగా వారి మనుగడ సాగించాలంటే ధైర్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాలను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. పోక్సో చట్టం, బాల్యవివాహాలు చేసుకోవడం ద్వారా కలిగే అనర్థాలను తెలియజేశారు. సీడీపీవో అనూరాధ, కళాశాల డైరెక్టర్ మేరి, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన



పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ వలంటీర్లు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో పొగాకు ఉత్పత్తుల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. వలంటీర్లు బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు వాడడం వలన నోరు, గొంతు క్యాన్సర్ వచ్చే ప్రమాద ఉందని, గుండె, ఊపిరితిత్తులకు అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్‌లు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి బయట పడాలంటే దృఢమైన నిర్ణయంతో పాటు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవడం, యోగ, ధ్యానం వంటివి చేయాలని సూచించారు. ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి, వలంటీర్లను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, కె.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

రామాయణం.. జీవన పారాయణం కావాలి

నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారం శ్రీకంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరం (గాయత్రి మాతా మందిరం)లో బుధవారం సంస్కృత సప్తాహం చేపట్టారు. దేవాలయ పాలకవర్గ సభ్యులు రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయ శర్మ మాట్లాడుతూ సంస్కృతం జనభాష కావాలన్నారు. మానవుని మహనీయునిగా, మహాత్మునిగా మార్చే మహత్ గ్రంథం శ్రీమద్రామాయణమని పేర్కొన్నారు. అందరూ పఠించాలని ఆయన సూచించారు. డాక్టర్ కోగంటి వెంకట లక్ష్మీనృసింహ అప్పలచార్యులు 'రామాయణం – ధర్మం' అనే అంశంపై మాట్లాడారు. ధర్మాన్ని కాపాడితే అది నిన్ను కాపాడుతుందని తెలిపారు. ధర్మాన్ని నాశనం చేస్తే అది ప్రాణులన్నింటిని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. రాముడు ధర్మ స్వరూపుడని తెలిపారు. రాముడి గొప్పతనాన్ని మారీచుడు రావణాసురునికి తెలియజేశాడని చెప్పారు.

దుగ్గిరాల బాలికల పాఠశాలలో స్వచ్ఛతా క్యాంపు



దుగ్గిరాల: గ్రామీణ విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత గురించి పలు సూచనలు అందించడం జరిగిందని హెచ్ఎం ఎస్.శోభాదేవి తెలిపారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఎయిమ్స్ వైద్యుల బృందం స్వచ్ఛతా క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం శోభాదేవి మాట్లాడుతూ 8, 9 తరగతుల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, పరిశుభ్రతపై సూచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చుండూరు మృతవీరులకు నివాళులు



ఐక్యవేదిక ఆధ్వర్యంలో నివాళులు

తెనాలి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం చుండూరు మృతవీరులు, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు పలువురు నివాళులర్పించారు. స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర్లోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చుండూరులో దళితుల హత్యాకాండ, అనంతర పరిణామాలపై చర్చించారు. మృతవీరులకు నివాళి అర్పించి పలువురు మాట్లాడారు. తన మాట, పాటలతో ప్రజా చైతన్యాన్ని కలిగించిన ప్రజాయుద్ధనౌక గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) అని కొనియాడారు. తన పాటలతో సమాజాన్ని నిరంతరం జాగృతం చేసిన వ్యక్తి గద్దర్ అని అన్నారు. ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, కమాదుల స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో..

జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం చుండూరు దళిత మృతవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొవెవరపు దేవయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. 34 ఏళ్లు గడిచినా చుండూరు మృతవీరులకు తగిన న్యాయం జరగలేదన్నారు. ఆలోచనాపరులు, సంఘటిత శక్తులు, దళిత, బహుజన సంఘాలు భవిష్యత్ కార్యాచరణకు పూనుకుని, సుప్రీంకోర్టులో విచారణ వేగంగా జరిగేలా చూడాలని కోరారు. బాధితుల తరపున వాదించిన న్యాయవాది బి.చంద్రశేఖర్‌కు, ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో బేతాళ భూషణం, వల్లభాపురం శ్యామ్‌బాబు, జిలుగు పీటర్, డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, మేకల సురేష్ పాల్గొన్నారు.

హిరోషిమా విధ్వంసం పునరావృతం కాకూడదు

స్లైడ్, వీడియో ప్రదర్శనలో ఐకా బాలాజీ



ఐకా బాలజీ, నిర్మలను సత్కరిస్తున్న డాక్టర్ రామరాజు, వెంకట్రామ్

తెనాలి: 'ప్రపంచానికి అణ్వస్త్రాలు వద్దు.. అన్నవస్త్రాలు కావాలి' అనే నినాదంతో కోల్‌కత్తాకు చెందిన వైజ్ఞానిక–సాంస్కృతిక సేవాసంస్థ 'ముందడుగు' వ్యవస్థాపకుడు ఐకా బాలాజీ ఆధ్వర్యంలో హిరోషిమా విధ్వంసంపై స్లైడ్, వీడియో ప్రదర్శనను నిర్వహించారు. జనసాహితి సంస్థ సహకారంతో హిరోషిమా డేను బుధవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆగస్టు 6న అమెరికా తన ప్రత్యర్థి దేశమైన జపాన్‌లోని హిరోషిమా నగరంపై 15 కిలో టన్నుల అణుబాంబుతో దాడిచేసినట్లు బాలాజీ తెలిపారు. దీంతో హిరోషిమా నగరం సర్వనాశనం కాగా.. మూడున్నర లక్షల మంది ప్రజలు మరణించారనీ, అణుధార్మికతతో లక్షలాది ప్రజలు దశాబ్దాలపాటు అనేక వ్యాధులు, శారీరక, మానసిక రుగ్మతలు, అంగవైకల్యాలతో హృదయవిదారకమైన జీవితాలను గడిపారని చెప్పారు.

500 పైగా ప్రదర్శనలు..

మానవాళికి పెనుముప్పుగా, మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిన హిరోషిమాపై దాడులు వంటివి పునరావృతం కారాదనే సందేశాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో నాటి విధ్వంసం, అనంతర పరిణామాలతో ఈ ప్రదర్శనను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. గత 35 ఏళ్లుగా 500 పైగా ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరుస్తున్న బాలజీ, నిర్మలను వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, సీఈవో వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై తమ భావాలను తెలియజేసిన విద్యార్థులు మోక్షజ్ఞ, పరిమళ, జుయెల్, శ్రావ్యలను అభినందించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పర్యవేక్షించగా, శివకుమార్, మురళీ, చౌదరి సహకారం అందించారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు



రైతులకు మినుముల సంచులను అందిస్తున్న ఏవో విజయబాబు

మంగళగిరి: రైతులందరూ తమ పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శైలజారాణి తెలిపారు. బుధవారం మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెద వరిలోని కలుపు యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తాము వేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులందరూ కౌలు కార్డులు ఈఆర్‌వో ద్వారా తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో అన్నదాత సుఖీభవ బ్యాంక్ అకౌంట్ లింక్ చేయవలసిన వారి జాబితా నోటీసు బోర్డులో ఉంచామని పేర్లు ఉన్న రైతులు లింక్ చేయించుకోవాలన్నారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దుగ్గిరాల: భాసర్వం కరిగించే బ్యాక్టీరియా, పొటాషియం విడుదల చేసే ద్రవరూప జీవన ఎరువులను రైతులకు పంపిణీ చేసి, ఉపయోగించే విధానాలను ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు, మోరంపూడి, గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు పంటలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. జీవన ఎరువులు వాడి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కంది పైరును పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆహార భద్రత మిషన్‌లో భాగంగా మినుము సంచులను రైతులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.మేరిమ్మ, ఎంపీటీసీ కె.మధు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



దుగ్గిరాల: ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమిని చెప్పి నేడు నోరు మెదపకపోవడం విచారకరమని సీపీఎం కార్మిక నాయకులు జొన్నె బాలరాజు అన్నారు. దుగ్గిరాల విద్యుత సబ్ స్టేషన్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలపై విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో భారం వేయాలని చూస్తుందని, విద్యుత్ సంస్థలను అదానీకి అప్పగించాలని ఈ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. వేళాపాళా లేకుండా గంటల కొద్ది కోతలు పెడుతున్నారని, నాణ్యమైన కరెంటు ఇస్తామని విపరీతమైన కరెంటు కోతలు పెట్టడం దారుణం అని అన్నారు. వ్యవసాయానికి కూడా సక్రమంగా కరెంటు ఇవ్వకపోతే పంటలకు నీరు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వై.స్టాలిన్, ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, ఎ.పాములు వి.శేషగిరి, సాంబశివరావు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలకు అంతరాయం

తెనాలి: పట్టణంలోని పలు పోస్టాఫీసుల్లో పోస్టల్ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత మూడు రోజులుగా ఈ సమస్య నెలకొంది. ఆన్‌లైన్ లావాదేవీలకు అవకాశం లేకుండాపోయింది. ఒక్కోసారి సర్వర్ పనిచేయడం, ఆ వెంటనే కొద్ది సేపట్లోనే ఆగిపోతూ సహనాన్ని పరీక్షిస్తోంది. పోస్టల్ వ్యవస్థలో నూతన సాఫ్ట్‌వేర్ 2.0ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం రెండు రోజుల పాటు పోస్టాఫీసుల్లో అప్‌డేట్ చేశారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో సమస్యలు వస్తున్నాయి. మరి కొద్ది రోజులు ఈ సమస్య తప్పకపోవచ్చునని ప్రజలు భావిస్తున్నారు.